
ప్రజాశక్తి
ఆదివారం 24 మార్చి 2024
5
పార్వతీపురం మన్యం



పెదబొండపల్లిలో ఇద్దరు వాలంటీర్లు తొలగింపు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని ఇద్దరు వాలంటీర్లను విధుల నుంచి తొలగింపునకు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నివేదిక సమర్పించామని స్థానిక ఎంపిడిఒ అకిబ్ జావేద్ శనివారం తెలిపారు. పెదబొండపల్లి సచివాలయ పరిధిలోని పనిచేస్తున్న వలంటీర్లు గొడబ ప్రభాకర్, దేవాబత్తుల రవి ఎన్నికల ప్రవర్తన నియమావళికి వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో వారిపై విచారణ జరపగా వాస్తవమని తేలడంతో వారిద్దరి సస్పెన్షన్‌కు ఎన్నికల అధికారికి నివేదించామని ఎంపిడిఒ తెలిపారు.

పత్రాలిచ్చారు... ప్రవేశాలు మరిచారు

- అతిగతి లేని విద్యుత్ మీటర్లు
- ఇదీ టిడ్కో లబ్ధిదారుల పరిస్థితి



ప్రజాశక్తి- సాలూరు


పట్టణంలోని పేదలకు సంబంధించిన టిడ్కో గృహ సముదాయంలో నెలరోజుల క్రితం అట్టహాసంగా ప్రవేశాలు జరిగాయి. డిప్యూటీ సిఎం రాజన్నదొర 1056 మంది టిడ్కో ఇళ్ల లబ్దిదారులకు హక్కు పత్రాలను అందజేశారు. ఈ ఇళ్లకు విద్యుద్దీకరణ పనులకు సంబంధించి పనులు పూర్తయ్యాయి. కానీ లబ్దిదారుల ఇళ్లకు విద్యుత్ మీటర్ల విషయంలో స్పష్టత లేదు. లబ్దిదారులు స్థానిక ఎడిఇ కార్యాలయంలో విద్యుత్ మీటర్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని చెపుతున్నారు. కానీ ఇంతవరకు ఒక్కరూ దరఖాస్తు చేసుకున్న దాఖలాల్లేవు. 1.5 ఎంవి సామర్థ్యం కలిగిన మీటర్ కోసం రూ.269 చెల్లిస్తే సరిపోతుందని అధికారులు తెలిపారు. అయితే టిడ్కో లబ్దిదార్లు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. మరో పక్క ఈ గృహ సముదాయాలకు తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులు కూడా పూర్తి కాలేదు. గుమడాంకు వేగావతి నది ప్రాంతం నుంచి పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేశారు. నదిలో ఇన్ ఫిల్ట్రేషన్ బావుల నిర్మాణం జరిగింది. పైపులైన్ నిర్మాణ పనులు కూడా 90 శాతం పూర్తయ్యాయి. 3.6 కిలో మీటర్ల పొడవున పైపులైన్ నిర్మాణం చేపట్టాలి. ఎంపిడిఒ కార్యాలయం వద్ద రైల్వే ట్రాక్ ఉండడంతో సంబంధిత శాఖ అధికారుల అనుమతి మంజూరైంది. రైల్వే ట్రాక్ కింద నుంచి పైపులైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. పదిరోజుల్లో మిగిలిన పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని టిడ్కో అధికారులు చెబుతున్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులకు రూ.6.5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. విద్యుత్ మీటర్ల కోసం దరఖాస్తు విషయంలో విద్యుత్ అధికారులు స్పష్టత ఇస్తున్నా లబ్దిదారులు మీటర్ల కోసం దరఖాస్తు చేయడానికి ముందుకు రావడం లేదు.

పదిరోజుల్లో పైపులైన్ నిర్మాణం టిడ్కో ఎఇ ప్రవీణ్

టిడ్కో ఇళ్లకు తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులు దాదాపు పూర్తయ్యాయి. 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఎంపిడిఒ కార్యాలయం వద్ద రైల్వే ట్రాక్ కింద నుంచి పైపులైన్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరయ్యాయి. పదిరోజుల్లో పనులు పూర్తి చేస్తాం.

ప్రచార భారం భరించడమెలా?

- పోలింగ్‌కు రెండు నెలలు గడువు
- ప్రధాన రాజకీయ పార్టీల్లో ఆందోళన



ప్రజాశక్తి - సాలూరు

సాధారణ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ నిర్వహణకు రెండు నెలలు గడువు ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నోటిఫికేషన్ విడుదల కాగానే ఎన్నికల ప్రచారం చేపట్టే పరిస్థితి కనబడడం లేదు. మే 13న పోలింగ్ నిర్వహణకు ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎక్కువ సమయం ఉండడంతో ప్రచారభారం తడిసి మోపెడవుతుందని టిడిపి, వైసిపి అభ్యర్థులు భావిస్తున్నారు. ప్రచారంలోకి దిగిన తర్వాత కార్యకర్తలు, అభిమానులు, నాయకుల ఖర్చులు అభ్యర్థులే భరించాల్సి ఉంటుంది. రెండునెలల పాటు ఈ ఖర్చులన్నీ భరించడం తలకు మించిన భారంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మద్యం, బిరియాని, రోజువారీ ఖర్చులతో పాటు వాహనాల ఇంధనం ఖర్చులు కలిపి అభ్యర్థులే భరించాలి. ఇవే కాక ఓటర్లకు డబ్బులు, మద్యం పంపిణీ చేయాల్సి ఉంది. ఇవన్నీ పోలింగ్ తేదీకి వారం పది రోజుల్లో జరగాల్సి ఉంటుంది. రెండునెలల ముందుగానే ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తే మరిచిపోయే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎపి ఎన్నికలు నాలుగో విడత జరుగనున్నాయి. ఏప్రిల్ 18న ఎపి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నెలరోజుల ముందుగా ప్రచారం చేపడితే ఖర్చుల భారం తగ్గించుకోవచ్చుననే అభిప్రాయం ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కనిపిస్తోంది. తాజా పరిస్థితుల్లో పలువురు నాయకులు ఇంకా ప్రచారానికి శ్రీకారం చుట్ట లేదు. ప్రచారం ప్రారంభించే లోగా పార్టీకి చెందిన అసంతృప్తి వాదుల బుజ్జగింపులు, చేరికలు, వ్యూహాలు ఎత్తుగడలపై సీనియర్ నాయకులతో సమాలోచనలు జరుపుతున్నారు. టిడిపి అభ్యర్థి సంధ్యారాణి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రచార రథంతో ఎన్నికల శంఖారావం పూరించారు. ఆమె కూడా ప్రత్యర్థి పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

దూర విద్యా కేంద్రంలో అడ్మిషన్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా కేంద్రంలో బిఎ, బికాం, ఎంఎ ఇంగ్లీష్, ఎంఎ తెలుగు, ఎంఎ సోషియాలజీ, ఎంఎ సోషల్ వర్క్, ఎంకామ్ సబ్జెక్టుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా కేంద్రం స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 6300279440, 9848127696 ఫోన్ నెంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.



చెక్‌పోస్టు వద్ద రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఆంధ్రా -ఒడిస్సా సరిహద్దుల్లో పటిష్ట భద్రత

ప్రజాశక్తి - కురుపాం

రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద నిరంతరం పటిష్ట భద్రత నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని మంత్రజోల సమీపాన గల మూలిగూడ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతానికి ఎన్ని కేసులు నమోదయ్యాయని, ఎంత మేరకు వాహనాలు సీజ్ చేసిన వివరాలను స్థానిక ఎస్సై ఎస్.షణ్ముఖరావును అడిగి తెలుసుకున్నారు. తొమ్మిది కేసులు వరకు నమోదయ్యాయని, 490 లీటర్ల నాటు సారా పట్టుబడగా, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఫోర్ వీలర్ వాహనాన్ని సీజ్ చేసినట్లు కలెక్టర్‌కు తెలిపారు. అక్రమ మద్యం, నగదు తరలించకుండా 24 గంటలు నిరంతరం పటిష్ట నిఘాను పెట్టాలని సూచించారు. చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా చెక్‌పోస్ట్ తనిఖీలను కంట్రోల్ రూమ్ నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. చెక్ పోస్ట్ నుంచి సీసీ కెమెరాలు పని తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విధమైన ఉదాసీనతను ప్రదర్శించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పాలకొండ ఆర్‌డిఒ ఎ.వెంకటరమణ, తహశీల్దార్ బి.శివశంకర్ సత్యనారాయణ, ఆర్ఐ కరుణాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

అందరినోటా ఎన్నికల మాట



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికలు దగ్గరపడ్డాయ్... నోటిఫికేషన్ వచ్చి కూడా దాదాపు వారం రోజులు గడించింది. వైసిపి గత శనివారమే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని స్థానాల్లోనూ తిరిగి సిట్టింగులకే అవకాశం కల్పించింది. ఇటు టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో విజయనగరం, అరకు ఎంపీస్థానాలు, చీపురుపల్లి అసెంబ్లీ, మన్యం జిల్లా పాలకొండ అసెంబ్లీ స్థానాలు మినహా మిగిలిన చోట్ల అభ్యర్థులను ఖరారు చేశారు.

మరోవైపు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేసింది. అభ్యర్థుల ఎన్నికల ప్రచాం హోరు కూడా ఇటీవలే జోరందుకుంది. ఎన్నికల తేదీ దగ్గర పడుతుండడంతో వివిధ పార్టీల బలాబలాలతోపాటు అభ్యర్థుల సామర్థ్యం, సానుకూల అంశాలు, ప్రతికూల అంశాలపై పబ్లిక్ టాక్ ఊపందుకుంది. గత ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి స్థానిక సమస్యల పరిష్కారానికి, జిల్లాకి, రాష్ట్రానికి ఇచ్చిన హామీలతోపాటు అంతకు ముందు టిడిపి పాలనలో చేపట్టిన పనులు, పథకాలు, వైఫల్యాలను కూడా భేరీజువేస్తున్నారు. అభ్యర్థులు మాత్రం ఓవైపు ప్రచారంలో బిజీబిజీగా గడుపుతూనే ఓటర్లను ఆశలపల్లకిలో ముంచే పనిలో నిమగ్నమయ్యారు. అక్కడక్కడా లోబరుచుకునే ప్రయత్నాలు కూడా మొదలయ్యాయి. ఎన్నికల ప్రచార సామగ్రి సమకూర్చుకునే పనిలో ముఖ్యంగా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు తలమునకలయ్యాయి. దీంతో, ఫ్లెక్సీలు, బేనర్లు, పోస్టర్స్, కరపత్రాలు వేసే ప్రింటర్లు బిజిబిజీగా మారారు. ఈనేపథ్యంలో ఎన్నికల అధికారులు కూడా ప్రచారానికి పరిమితులు విధించారు. ఇంతకు ముందులా ముందస్తు అనుమతి తీసుకోకుండా అభ్యర్థులు నచ్చిన చోటులో ప్రచారం చేసేందుకు అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు. ఇటు మీడియాలోని రాతలపైనా ఎన్నికల అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాల్లో ఎన్నికల మానటరింగ్ సెల్ ఏర్పాటుచేశారు. ఎన్నికల ఏర్పాట్లతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించి సకాలంలో స్పందించే విధంగా తగిన సిబ్బందిని నియమించారు. ఇక చెప్పడాలుండవ్... చర్యలే అంటూ ఇప్పటికే రెండు జిల్లాకు చెందిన ఎన్నికల అధికారులు (కలెక్టర్లు) హెచ్చరికలు జారీచేసిన సంగతి తెలిసిందే. ఇక ప్రధాన పార్టీల విషయానికి వస్తే ముఖ్యంగా టీడిపిలో దాదాపు అన్ని చోట్లా అంతర్గత విభేదాలు ఎన్నికల సందర్భంగా మరోసారి రచ్చకెక్కాయి. సీట్లు రాక కొంతమంది అలకబూని, తమ కేడర్‌ను కొత్త అభ్యర్థుల వెంట వెళ్లకుండా అడ్డుపడుతున్నారు. భోగాపురంలో పొత్తులో భాగంగా జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా లోకం మాధవిని ప్రకటించినప్పటికీ తెలుగు తమ్ముళ్లు సహకరించని పరిస్థితి దాపురించింది. ఎంపి టిక్కెట్ కూడా బిజెపికి కేటాయించ నుండడంతో తమ పార్టీ గుర్తు చూడడానికి కూడా అవకాశం లేకుండా పోయిందంటూ తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు వైసిపి ప్రమాదకరమైన గ్రూపులేమీ లేకపోయినప్పటికీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ స్థాయి నాయకులకు వివిధ భవనాలు, రోడ్ల నిర్మాణ పనులకు బిల్లులు రూ.కోట్ల పెండింగ్‌లో ఉండడం వల్ల వైసిపిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది తమ ప్రభుత్వంలో అప్పుల ఊబిలో కూరుకుపోయామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులు కేంద్రం ఇవ్వకపోవడం, ఇచ్చిన అరకొర నిధులు తమ అధినేత ఇతర అవసరాలకు మళ్లించడంతో గ్రామాల్లో వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ వంటి కనీస అవసరాలు తీర్చలేకపోయామని, ఇటు సచావాలయాలు తమ పరిధిలో లేకపోవడం వల్ల సంక్షేమ పథకాలు తమకు సంబంధం లేకుండానే మంజూరయ్యాయని, ఇటువంటి పరిస్థితుల్లో తమ మాట ఇప్పుడు ఎలా చెల్లుబాటు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపిలు అయోమయ పరిస్థితుల నడుమ ఎన్నికలకు సిద్ధమౌతున్నాయి. దీంతో, గ్రామాల్లో సభలకు కూడా వేలాది రూపాయలు ఖర్చుచేసుకోవాల్సిన దుస్థితి ఆయా పార్టీలకు ఏర్పడిందని జనం చర్చించుకుంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

రూట్ మ్యాప్ తయారు చేసుకోవాలి


ప్రజాశక్తి - సీతంపేట

నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్లకు సంబంధించి రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని పాలకొండ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కల్పనా కుమారి అన్నారు. శనివారం సెక్టార్, రూట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామాగ్రి తీసుకెళ్లడానికి అనుకూలంగా ఉండేలా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. బస్సులు వెళ్లలేని పోలింగ్ కేంద్రాలకు బొలెరో, మ్యాక్సీ క్యాబ్ వాహనాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఓటింగ్ సమాచార నిమిత్తం సిగ్నల్స్‌లేని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. పోలింగ్ సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకోవడంలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమైందన్నారు. కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ మహేశ్వరరావు, ఆర్ఐ వెంకటేశ్వరరావు, సెక్టార్ రూట్ అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షకు 98.78 శాతం మంది హాజరు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాల్లో శనివారం జరిగిన పదో తరగతి భౌతిక శాస్త్రం పరీక్షకు 10,976మంది విద్యార్థులకు గాను 10842మంది హాజరు కాగా, 134 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 66 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 98.78 హాజరు శాతం ఉందని, ఈ పరీక్షలను 21 కేంద్రాలను స్క్వాడ్ బృందాలు పరిశీలించగా తాను మూడు కేంద్రాలను పరిశీలించినట్లు ఆమె పేర్కొన్నారు.



బలిజిపేట : భగత్‌సింగ్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న రెడ్డి వేణు

భగత్‌సింగ్ ఆలోచనలను చంపుతున్న పాలకులు

వర్ధంతి సభలో ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

బ్రిటీష్ ప్రభుత్వం భగత్‌సింగ్‌ను చంపినట్టుగానే ఈనాటి ప్రభుత్వాలు ఆయన ఆలోచనలను చంపేందుకు అనేక ప్రయత్నాలు చేస్తుండడం దేశ దౌర్భాగ్యమని ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక భాస్కర్ డిగ్రీ కళాశాలలో వర్ధంతి సభను శనివారం నిర్వహించారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ శాస్త్రి, కవి గంటేడ గౌరినాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి అఖిల్, జిల్లా కమిటీ సభ్యులు పి.రాజశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గౌరినాయుడు మాట్లాడుతూ ఈనాటి హీరోలు మూడు గంటల పాటు డబ్బు కోసం తెరవెనుక తైతక్కలాడే జీరోలని, సమాజం ఉన్నంత వరకు, చరిత్ర గమనం ఉన్నంత వరకు ఈ భూమి మీద పోరాటాలు జరుగుతున్నంత వరకు తమ జీవితాలను తృణప్రాణాల సైతం త్యాగం చేసిన నిజమైన హీరోలు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లని కొనియాడారు. ఈనాటి యువతరానికి జీరోలు కావాలో, హీరోలు కావాలో తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. చారిత్రకమైన భారత దేశంలో దేశ స్వాతంత్ర ఉద్యమ నాయకులను గుర్తుపట్టలేకపోవడం చాలా బాధాకరమని, అటువంటి పరిస్థితులను నేటి పాలక ప్రభుత్వాలు చేపడుతున్నాయని మండిపడ్డారు. ఈ దేశ సంపదను దోచుకుపోతున్న బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టాలని తన ప్రాణాలను లెక్కచేయకుండా 23 సంవత్సరాలకే ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ జీవిత అంశాలను పాఠ్యాంశాల నుంచి తొలగించి, మన జాతిపిత మహాత్మా గాంధీజీని హత్య చేసిన మతోన్మాది, బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాభిక్ష మొరపెట్టుకున్న గాడ్సే వారసుల సావర్కర్ జీవిత చరిత్రలను నేటి పాఠ్యాంశాలలో జోడిస్తుంటే మళ్లీ బ్రిటీష్ ప్రభుత్వం తిరిగి వచ్చిందనే భావన కలుగుతుందని వాపోయారు. ఈ విధానాన్ని తీవ్రంగా ఖండించాల్సిన అవసరం మనందరిపైనా ఉందన్నారు. ప్రస్తుతం ఉన్మాదపు దేశభక్తులు మతాలు, కులాల మధ్య అనేక విచ్ఛిన్న శక్తులను జోడించి విధ్వంసాలకు పాల్పడుతున్నారని, రాజ్యాంగాన్ని తునాతునకలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి ఉద్యమాలకు స్ఫూర్తిని రగిలించే భగత్‌సింగ్ ముఖ చిత్రాన్ని కుయానా దేశభక్తులు అడ్డుపెట్టుకొని నాటి బ్రిటీష్ ప్రభుత్వాలు తెచ్చిన కార్పొరేట్ విధానాలను అవలంబిస్తున్నారని, అటువంటి ఉన్మాదపు కార్పొరేట్ శక్తులను తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. కావున భగత్ సింగ్ నేటి యువతరం నుండే పుట్టాలని, కాసుల కోసం కక్కుర్తి పడే హీరోలుగా కాకుండా దేశం కోసం, సమాజ అభివృద్ధి కోసం ఆదర్శంగా నిలబడే హీరోలుగా నిలవాలని విద్యార్థులను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల, విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వం భగత్‌సింగ్‌ను చంపినట్టుగానే ఈనాటి ప్రభుత్వాలు ఆయన ఆలోచనలు కూడా చంపాలని అనేక ప్రయత్నాలు చేపడుతున్నాయని విమర్శించారు. ఈనాటి భారతదేశంలో దేశ స్వాతంత్ర ఉద్యమ నాయకులను గుర్తుపట్టలేకపోవడం చాలా బాధాకరమని, అటువంటి పరిస్థితులను నేటి పాలక ప్రభుత్వాలు చేపడుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వై.మన్మధరావు, మండల నాయకులు గంట్యాడ బలరాం, ఆవు సాంబమూర్తి, బద్దనా భానుమూర్తి, పి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి సభ యువజన సంఘం నాయకులు కె.రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కిసాన్ మోర్చా నాయకులు బోను గౌరినాయుడు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు ఈ సందర్భంగా గౌరనాయుడు మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడి దేశాన్ని, ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు.కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.రామారావు, కెవిపిఎస్ నాయకులు అప్పలస్వామి, అప్పారావు, చిరు వ్యాపారుల సంఘం నాయకులు బండి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

సీతంపేట : ఐటిడిఎ పరిధిలో విధుల్లో కొనసాగిన ఆదివాసి మాతృ బహుభాషా ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయంలో శనివారం సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సవర డుంబు, యువత భగత్ సింగ్ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఆయన జీవిత చరిత్ర, యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భగత్ సింగ్ గురించి ఉపాధ్యాయులకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎల్లాంగో, కార్యదర్శి ఆనందరావు, గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : భగత్‌సింగ్ ఆశయాలను సాధించేలా యువత ముందుకు రావాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని దేవుకోన పంచాయతీ అంటివలసలో భగత్ సింగ్ 93వ వర్ధంతి సభ ఘనంగా జరిగింది. ముందుగా సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు వెంకటేష్, గంగరాజు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంటివలసకు చెందిన యువకులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : విప్లవ వీర కిశోరాలు భగత్ సింగ్, రాజ్‌గుర్, సుఖదేవ్‌ల 93వ వర్ధంతి శనివారం స్థానిక వర్తక కళాసీ సంఘం భవనంలో అఖిల భారత రైతు–కూలీ సంఘం (ఎఐకె.ం.స్), భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు)ల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బొత్స నర్సింగరావు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు గేదెల సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగినసభలో పిఒడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రమణి, పి.లక్ష్మణరావు (ఎఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి), జన్ని ముత్యాలు (ఎఐకెఎంఎస్ జిల్లా కోశాధికారి), అఖిల భారత ఆదివాసీ వేదిక జాతీయ కమిటీ సభ్యులు సంబుడు జయలక్ష్మి తదితరులు మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ త్యాగధనుల కలలు నెరవేరలేదని దేశంలో పీడిత ప్రజల రాజ్యం రాలేదని, దేశ ప్రజల కష్టాలు తీరలేదని, మరింతగా దేశంలో సామ్రాజ్యవాదుల, కార్పొరేట్ కంపెనీల దోపిడీ పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక మనువాద బిజెపి పాలకులు ఓట్ల కోసం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ మైనారిటీలపై, దళిత, ఆదివాసీ మహిళలపై దాడులు, అత్యాచారాలు సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మతాన్ని, కులాన్ని, అంటరానితనాన్ని తీవ్రంగా వ్యతిరేకించి లౌకిక వ్యవస్థను కాంక్షించిన నాటి విప్లవ వీరుల ఆశయ సాధనకు అనుగుణంగా మతతత్వ, మనువాద బిజెపి పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలని, అందుకు అన్ని ప్రజాస్వామిక, విప్లవ, వామపక్ష శక్తులు ఐక్యమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

సాలూరు: స్వాతంత్ర్య సమర యోధుడు, దేశం కోసం ప్రాణాలర్పించిన పోరాట వీరుడు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ, సిఐటియు, పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లు ఉరికంబాలు ఎక్కారని చెప్పారు. అలాంటి త్యాగధనులను విస్మరించి మతోన్మాదం ప్రేరేపించిన గాడ్సేని కీర్తిస్తున్నట్లుగా బిజెపి ప్రభుత్వ విధానాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు మహేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం : సభలో మాట్లాడుతున్న కవి గౌరునాయుడు

25 మంది రక్తదానం

భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కొంకివీధి కల్యాణమండపంలో మీ సేవకై మేము సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన రక్తదాన శిబిరంలో 25 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ సిఐ విహెచ్.వాసునాయుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ బంకురు అప్పలనాయుడు, డాక్టర్ దాక్షాయణి ప్రారంభించారు. రక్తదాతలను అభినందించారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సంస్థ అధ్యక్షులు ఇప్పిలి దిలీప్ కుమార్, మనోజ్, కుమార్ పాల్గొన్నారు.



సీతంపేట : భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు



సాలూరు : నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు, యువకులు

స్పందించిన అధికారులు... తొలగించిన స్టిక్కర్

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి కొత్త రంగుతో 'ప్రజాశక్తి'లో శనివారం వెలువడిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆ కార్యాలయం లోని బీరువాకు ఉన్న టిడిపి స్టిక్కర్‌ను తొలగించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి కానుక స్టిక్కర్‌ను స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బీరువాకు అతికించారు. నాటి నుండి నేటి వరకు అది అలాగే ఉంది. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో వాటివైపు ఎవరూ కన్నెత్తి చూసే దాఖలాల్లేవు. ప్రతి ఇంటికి అంటించి ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్టిక్కర్లను సైతం అధికారులు తొలగించారు. వారి కార్యాలయంలో ఉన్న ఈ స్టిక్కర్ అధికారులు కనిపించలేదా? ఓటర్లను ప్రభావితం చేయవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు వెలువడిన వార్తకు అధికారులు స్పందించి స్టిక్కర్‌ను తొలగించారు.



బీరువాపై ఉన్న స్టిక్కర్‌ను తొలగించిన అధికారులు


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని పలు గ్రామాల్లో మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు జి.చంద్రమౌళి, బోను చంటి, జనసేన నాయకులు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో విస్తృతంగా టిడిపి సూపర్ సిక్స్ పేరిట అమలు చేయనున్న సంక్షేమ పథకాలపై ఉపాధి హామీ కూలీలతో సమావేశాలు నిర్వహించి వారికి వివరించారు. సంక్షేమ పథకాల పేరిట ధరలను విపరీతంగా పెంచేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిన వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట నాయుడు, బేత లక్ష్మణరావు, జాగాన రవికుమార్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ సూర్యప్రకాష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు, తోటి వైద్యులు

డాక్టర్ సూర్యప్రకాష్‌కు సన్మానం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఈ ప్రాంత ప్రజలకు మంచి వైద్యమందించాలన్న లక్ష్యంతో తన స్వగ్రామమైన రావుపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి నిష్ణాతులైన వైద్యులచే వైద్యం అందించిన ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ గుల్ల సూర్య ప్రకాష్‌ను శనివారం సన్మానించారు. ఆయనతో పాటు ప్రముఖ వైద్యులు డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహనరావుతో పాటు రావుపల్లి మాజీ సర్పంచ్ గుల్ల కాశినాయుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు అన్నపూర్ణమ్మ, కాపారపు శివున్నాయుడులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇంతటి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యంతో పాటు ఖరీదైన మందులను అందజేయడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బొబ్బిలి ఏరియా హాస్పిటల్ సివిల్ సర్జన్ డాక్టర్ గుల్ల రామ్‌నరేష్, గుంట్రెడ్డి హరికుమార్, గుల్ల శంకరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన శ్రీసీతారామమందిర పున:ప్రతిష్ట మహోత్సవం రెండో రోజైన శనివారం డాక్టర్ సూర్యప్రకాశరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వల్లరిగుడబ వీధుల్లో పర్యటిస్తున్న ఎంపిడిఒ, అధికారులు

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని తుచ తప్పకుండా అమలు చేయాలని ఎంపిడిఒ పైల సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని వల్లరిగుడబలో ఎఫ్ఎస్‌టి టీంతో కలిసి ఎన్నికల ప్రవర్తన నియమావళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామస్థాయి అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉండొద్దని పేర్కొన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తగుచర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎక్కడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో నిర్లక్ష్యం ఉండరాదని ఎంపిడిఒ స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నియమాలు తుచ తప్పక పాటించాలని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఎఫ్ఎస్‌టి అధికారులు బర్లి గౌరీశంకరరావు, పంచాయతీ కార్యదర్శి డొక్కర దిలీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

విజయనగరంకోట : విజయనగరం రైల్వేస్టేషను రోడ్డులో శనివారం ఉదయం అనుమానాస్పదంగా సంచరిస్తున్న రాజస్తాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుండి రూ. 90 వేలు విలువైన గంజాయిని స్వాధీనంచేసుకున్నట్లు సిఐ బి.వెంకటరావు తెలిపారు. తమకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో ఎస్ఐ నవీన్ పడాల్ , టాస్క్ ఫోర్స్ ఎస్ఐ సాగర్ బాబు ఆధ్వర్యంలో పోలీసు బృందం రైల్వే స్టేషన్ రోడ్డులో ఇద్దరు వ్యక్తులు బ్యాగులతో వస్తుండగా చేసిందన్నారు. వారి బ్యాగుల్లో గంజాయి ఉన్నట్లు గుర్తించి విచారణ చేయగా, రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన జితేంద్ర సింగ్, బింజారాంగా తెలిపారన్నారు. తాము కూలి పనులు చేస్తుంటామని, గంజాయి అలవాటు ఉండడంతో తక్కువ మొత్తంలో తమ అవసరాలు తీర్చుకుంటూ, మరికొంత అమ్ముకోవాలని ఉద్దేశంతో సాలూరులో 18కిలోల గంజాయిని కిలో ఒక్కింటిని రూ.2వేలకు వీరు కొనుగోలు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయిని డిప్యూటీ తాహశీల్దార్ సమక్షంలో సీజ్ చేశామన్నారు. డబ్బులకు ఆశ పడి చాలామంది యువకులు ఈ తరహా నేరాలకు పాల్పడి, గంజాయి కేసుల్లో నిందితులుగా మారుతున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అర్థ రాత్రులు తిరుగుతూ ఇంటికి వస్తే వారు చెడు మార్గం పట్టే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, గంజాయి సేవించే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సిఐ తెలిపారు.

ఓటు అడిగే హక్కు మాకే ఉంది

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రాన్ని దోపిడీ చేయడానికే టిడిపి, జనసేన బిజెపితో పొత్తు పెట్టుకున్నాయని డిప్యూటీ సిఎం రాజన్నదొర విమర్శించారు. మండలంలోని శివరాంపురంలో ఎన్నికల ప్రచారానికి శనివారం ఆయన శ్రీకారం చుట్టారు. తొలుత గ్రామంలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ జర్జాపు మోహన్, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ రెడ్డి పద్మావతి ఆధ్వర్యాన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి మళ్లీ వైసిపిని గెలిపించాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎపిలో ఓటు అడిగే హక్కు వైసిపికే వుందన్నారు. కుల,మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని చెప్పారు. 2014 నుంచి 2019 సమయంలో టిడిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఏవీ లేవన్నారు. నియోజకవర్గంలో టిడిపి నాయకులు ఏం అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని అనేక సార్లు తాను సవాల్ చేసినా స్పందించలేదని చెప్పారు. తాను ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశానో చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. నియోజకవర్గంలో పేదలకు రూ.1600 కోట్ల మేర సంక్షేమ లబ్ధి అందించినట్టు తెలిపారు. రూ.1200 కోట్ల మేర రహదారులు, వంతెనలు, భవనాల నిర్మాణానికి ఖర్చు చేసినట్టు చెప్పారు. ఇంతటి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన ప్రభుత్వాన్ని వద్దనుకుంటే ప్రజలే నష్టపోతారని చెప్పారు. అధికారం కోసం టిడిపి నాయకులు అడ్డదారులు తొక్కు తున్నారని విమర్శించారు.ఇలాంటి పార్టీలను గెలిపిస్తే ప్రజలే నష్టపోతారని అన్నారు. ఐదోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే శివరాంపురంలో అసంపూర్తి వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. తన హయాంలోనే గ్రామాభివృద్ధి జరిగిందని రాజన్నదొర చెప్పారు. కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ కె. త్రినాథ్‌నాయుడు, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, సీనియర్ నాయకులు డోల బాల్కీ, మావుడి రంగు నాయుడు, మెంటాడ మండల నాయకులు ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రచారంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర


శివరాంపురంలో ప్రచారం చేస్తున్న రాజన్నదొర

గుమడాంలో ప్రచారం

ఎన్నికల ప్రచారం లో భాగంగా శనివారం డిప్యూటీ సిఎం రాజన్నదొర పట్టణం లోని గుమడాంలో కూడా పర్యటించారు. గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వైసిపికి ఓటు వేయాలని కోరారు. మళ్లీ గెలిపిస్తే పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఆయన వెంట వైసిపి సీనియర్ నాయకులు జర్జాపు సూరిబాబు, ఈశ్వరరావు, పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, జెసి ఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్ లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ,పప్పల లక్ష్మణరావు,మాజీ కౌన్సిలర్ తాడ్డి శంకరరావు, పరిశీలకులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

2024-25 విద్యా సంవత్సరంలో జిల్లా ఆదర్శ పాఠశాలలైన భామిని, కురుపాం, మునక్కాయవలస (మక్కువ), పురోహితునవలస (సాలూరు) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఆన్లైన్ ద్వారా ఎంపిసి, బైపిసి, ఎంఇఒ, సిఇసి గ్రూపుల్లో ఉచిత విద్య పొందగోరు విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ జి.పగడాలమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆదర్శ పాఠశాలల్లో బోధనా మాధ్యమం ఆంగ్లంలో ఉంటుందని,ఈ పాఠశాలలో విద్యనభ్యసించేందుకు ఎటువంటి ఫీజులు వసూలు చేయబడవని పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేయడానికి ముందుగా వివరాలతో కూడిన సమాచారం https://apn sapcfss.in/ https://cse.ap.gov.in/ను సంప్రదించాలన్నారు. కావున అభ్యర్థులు ఈనెల 28 నుంచి మే 22 వరకు net banking/ credit/debit 5 ?? gate way ద్వారా అప్లికేషన్ రుసుము చెల్లించిన తరువాత వారికి ఒక జనరల్ నెంబర్ కేటాయించబడును. ఆ https://apms.apcfss.in/ https://cse.ap.gov.in/ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ఒసి, బిసి, ఇడబ్ల్యుఎస్‌లకు రూ.200, ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.150 ఫీజు చెల్లించాలన్నారు. ప్రవేశాలు పదో తరగతి మార్కుల మెరిట్ ద్వారా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపల్‌ను గానీ లేక సంబంధిత డిఇఒ,ఎంఇఒలను గానీ సంప్రదించాలని కోరారు.

భామిని : స్థానిక ఎపి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో 2024- 25 విద్యా సంవత్సరానికి ఇంటర్ (ఇంగ్లీష్ మీడియం) ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి గ్రూప్‌ల్లో ప్రవేశాలకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారని ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. టెన్త్ మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయించనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపల్, ఎపి మోడల్ స్కూల్ 9440322964 9502579287, 8121187901 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

సీతానగరం : ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాలకు ఆన్లైన్‌లో దరఖాస్తులను ఈనెల 28 నుంచి మే 22 వరకు స్వీకరిస్తారని ఎంఇఒ జి.సూర్యదేముడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి సిఇసి గ్రూపుల్లో చేరుగోరు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరికొన్ని విషయాలను తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

రెండోసారి ఎమ్మెల్యేగా అవకాశమివ్వండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం నియోజక వర్గానికి రెండోసారి తనకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించి అవకాశం ఇవ్వాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలోని కొత్తవలస ప్రాంతం శనివారం ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేపట్టి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లతో మాట్లాడుతూ మీకు ఈ ప్రభుత్వంలో మేలు జరిగితేనే మళ్లీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని, ఏ ఒక్క కుటుంబానికి కూడా కనీసం ఏ ఒక్క మేలు జరగకుండా లేనేలేదని, కావున ప్రజలంతా కూడా విజ్ఞతతో ఆలోచించి వైసిపి ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకోవాలని ఎమ్మెల్యేగా తనకు రెండో సారి మరో అవకాశం కల్పించి మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు మీరంతా తోడ్పాటును అందించి తద్వారా వైఎస్ జగన్‌ను సిఎంగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమాలలో ఎమ్మెల్యేతో ఆయా మండలాల, పురపాలక సంఘం ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, గృహసారధులు, సచివాలయం కన్వీనర్లు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రపంచ క్షయ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్టు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమీక్షించారు. జిల్లాలో 43 డిజిగ్నేటెడ్ మైక్రోస్కోప్ సెంటర్లు, 7 టిబి యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో 2023 జనవరి నుండి డిసెంబరు వరకు 1818 మందికి పాజిటివ్‌గా గుర్తించామని, వీరిలో 911 మందికి చికిత్స చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 230 మందిని గుర్తించి వారికి చికిత్స అందిస్తున్నామన్నారు. 98.3శాతం మందికి క్షయ వ్యాధి నుంచి విముక్తి కలిగించామని తెలిపారు. జిల్లాలో 16 పంచాయితీలను క్షయ రహిత పంచాయతీలుగా ఎంపిక చేశామని చెప్పారు. క్షయ వ్యాధి మందులు తీసుకుంటున్న వారికి నెలకు రూ.500 చొప్పున ఆరు నెలలకు రూ.3వేలు వారి ఖాతాల్లో జమ చేయనున్నట్టు పేర్కొన్నారు. క్షయ బాధితులను దత్తత తీసుకున్న వ్యక్తులు అందిస్తున్న రూ.700తో పౌష్టికాహారం కిట్లు అందిస్తామన్నారు. పౌష్టికాహారం అందించేందుకు ముందుకు వచ్చే దాతలు జిల్లా క్షయ నివారణ అధికారి వద్ద వివరాలు నమోదు చేయాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో 700 మంది పౌష్టికాహారం కిట్లు పొందుతున్నారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారిలో కనీసం 10 నుండి 15 శాతం వరకు కఫం పరీక్షలు చేయాలని ఆదేశించామని చెప్పారు. ఎఎన్ఎం, అశా కార్యకర్తలు క్షయరోగులను పరామర్శించి, మందులు వేసుకుంటున్నారో లేదో గమనించడమే కాకుండా ప్రతి రెండు నెలలకు ఒకసారి "కఫ" పరీక్షకు పంపించాలని సూచించామని చెప్పారు. మందులు వాడే రోగులకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యుడ్ని సంప్రదించి తగిన చికిత్స పొందాలని కోరారు. సమావేశంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ నారాయణరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను సస్పెండ్ చేయడం చట్ట విరుద్ధం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎటువంటి నోటీసులూ లేకుండా మిమ్స్ యాజమాన్యం ఉద్యోగులను సస్పెండ్ చేయడం చట్ట విరుద్ధం కాదా అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ ప్రశ్నించారు. శనివారం స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరశన సమ్మె 52వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా నిరశన శిబిరంలో సురేష్ మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా ఉద్యోగులను సస్పెండ్ చేయడం, డిఎలు ఎగ్గొట్టడం చట్ట విరుద్ధం కాదా? దీనిని జెసిఎల్ సమర్థిస్తారా అని ప్రశ్నించారు. ముఖ్యంగా జెసిఎల్ ఉన్నది కార్మికుల కోసమా మిమ్స్ యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరించడం కోసమా అని ఆగ్రహించారు. యాజమాన్యం ఉద్యోగుల పైన వేధింపులు సస్పెండ్‌లు ఆపాలని, బకాయిలు ఉన్న 7డిఎలను ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని ఆందోళన చేస్తుంటే యాజమాన్యం సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాగా ఈ సమస్యలను పరిష్కారం చేయాల్సిన లేబర్ అధికారులు ఒకవైపు కార్మికులతో ఉద్యోగులతో కార్మిక సంఘ నాయకులతో చర్చిస్తూనే యాజమాన్యం వైపు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. లేబర్ అధికారులు కార్మికుల పక్షాన ఉంటారా? తప్పు చేస్తున్న యాజమాన్య పక్షాన నిలుస్తారా తేల్చుకోవాలని, ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అప్పలనాయుడు, కామునాయుడు అనే ఇద్దరు ఉద్యోగులను ఎందుకు సస్పెండ్ చేశారని ప్రశ్నించారు. లేబర్ అధికారులు దీన్ని సమర్థిస్తారా? అని అడిగారు. వెంటనే ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేయాలని సురేష్, యూనియన్ అధ్యక్షులు టివి రమణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఎం. నారాయణరావు, అప్పలనాయుడు, కామునాయుడు, నాగభూషణరావు, రామకృష్ణ, రాంబాబు, మధు, గౌరీ, భవాని, ఆదినారాయణ, మూర్తి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

ధాన్యం డబ్బులు చెల్లించకుంటే ఆందోళన

ప్రజాశక్తి - జామి

మండలంలోని ధాన్యం రైతులకు ప్రభుత్వం కోట్లలో బకాయి పడిందని, కాయ కష్టం చేసి పండించిన పంటకు ఫలితం రాకుంటే రైతు ఏం తిని బతకాలని మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎఒ కిరణ్ కుమార్‌కి రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. సోమవారం నాటికి రైతుల ఖాతాల్లో డబ్బు జమ కానీ యెడల మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడాతమని హెచ్చరించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకూ రూ.8.40కోట్లు బకాయిలు చెల్లించాలన్నారు. ఇప్పటికే అనేక దపాలు జిల్లా ఉన్నతాధికారులకు వినతులు అందజేశామని కానీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించకుంటే ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వర్రీ రమణ, వేంద్రపు నాయుడుబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లించి రాయితీ పొందండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈ నెల 31 లోగా పట్టణ ప్రజలకు సంబంధించిన ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బకాయి ఉన్న ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని సూచించారు. ఈ చెల్లింపులను మున్సిపల్ కార్యాలయంలో గానీ, మీ పరిధిలో ఉన్న వార్డు సచివాలయాల్లో గానీ చెల్లించాలని, ఆన్లైన్ ద్వారా cdma.ap.gov.in వెబ్ సైట్‌లో ఆన్లైన్ పేమెంట్ చెల్లించి ఈ అవకాశాన్ని వినియోగించుకొని మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

సజావుగా టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలతో పాటు, గంగంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, నీలానగరం, బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగినట్టు ఎంఇఒ-1 డి.గౌరు నాయుడు తెలిపారు. అలాగే వీరఘట్టం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 9 మంది విద్యార్థులు, బాలికల ఉన్నత పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జరగబోయే ఎన్నికల్లో విధుల్లో భాగంగా ఎన్నికల సిబ్బందికి ఇ.ఎంఎల్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో తహశీల్దార్ కె.ఆనందరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.




శిక్షణలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సిబ్బంది సమన్వయంతో కృషి చేసి జిల్లాలో జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. స్థానిక ఎన్జీఓ భవనంలో ఆరోగ్య పర్యవేక్షకులు, సహాయకులకు కీటకజనిత వ్యాధుల నియంత్రణపై నిర్వహించిన రీ ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ శిక్షణలో పొందిన పరిజ్ఞానంతో క్షేత్ర స్థాయిలో కార్యాచరణ చేసి, దోమల వ్యాప్తి నియంత్రణ చర్యలు చేపడుతూ జ్వరాలు ప్రబలకుండా దృష్టి సారించాలన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు సర్వేలియన్స్ చేపట్టాలని, మలేరియా, డెంగీ లక్షణాలతో ఉన్న వారిని గుర్తిస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు జరిపాలన్నారు. హాస్టల్ విద్యార్థుల్లో జ్వరాలు గుర్తిస్తే వెంటనే చికిత్స అందజేసి పర్యవేక్షించాలన్నారు. డ్రైడే కార్యక్రమాలు పక్కగా నిర్వహించి డ్రైడే పాటించేలా ప్రజల్లో అవగాహన పెంపొందించాలని చెప్పారు. జిల్లాలో మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో మరింతగా దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు మాట్లాడుతూ రెండు రోజుల శిక్షణలో దోమల నియంత్రణ చర్యలు, స్ప్రేయింగ్ పద్ధతులు, కీటక సంహారిణి రసాయనాలు వాటిని వినియోగించు విధానం, జ్వరాల లక్షణాల ద్వారా గుర్తించడం, చికిత్స, క్షేత్ర స్థాయిలో విధి నిర్వహణకు మొదలగు అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించి సిబ్బందికి పరిజ్ఞానాన్ని పెంపొందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్, ఎఎంఒ సూర్యనారాయణ, జిల్లా విబిడి కన్సల్టెంట్ రామచంద్రరావు, ఇఒ నాగేంద్ర, సబ్ యూనిట్ అధికారులు, మలేరియా టెక్నికల్ సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.


భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న మాజీఎమ్మెల్యే చిరంజీవులు, నాయకులు

భగత్‌సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

అమరవీరుడు భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక పాత బస్టాండ్ కూడలిలో గల భగత్‌సింగ్ విగ్రహానికి టిడిపి, జనసేన నాయకులు మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలనుపణంగా పెట్టిన భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు నేటి యువతకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మజ్జి కృష్ణమోహన్. వలిరెడ్డి జగదీష్, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి ఎంపికలో తాత్సారం

కార్యకర్తల్లో నిరుత్సాహం

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని టిడిపి కార్యకర్తలు నిరుత్సాహానికి గురువుతున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిని అధిష్టానం మూడవ జాబితలోనూ ప్రకటించకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు నిరుత్సాహనికి గురవుతున్నారు. అధికార పార్టీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణను ప్రకటించడంతో వారు గ్రామాలలో ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. దీంతో టిడిపి కార్యకర్తలు అభ్యర్థి ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంపై అధిష్టానం ఏ విధమైన ఆలోచనతో ఉందోనని కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు. ఈ నియోజకవర్గం పై అధికార పార్టీ నాయకులు మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపి బెల్లాన చెంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు ప్రభావం ఎక్కువగా ఉన్న విషయం తెలిసిందే. అధికార పార్టీ నాయకులను, గ్రామాలలో ఉన్న వారి అనుచరులను ఎదుర్కోవటం తెలుగు తమ్ముళ్ల కు సవాలుగా ఉంది. అయితే టిడిపి విజయానికి కృషి చేస్తున్న కార్యకర్తలతో మరింత ఉత్సాహన్నీ నింపేందుకు అభ్యర్థి ఎంపిక పూర్తి చేసి ఉత్కంఠకు తెరదించాలని కార్యకర్తలు కోరుతున్నారు. అభ్యర్థి ఎంపిక పై పార్టీ సర్వేలో భాగంగా మొదటిలో కిమిడి నాగార్జున లేదా నోటా అని, రెండోవ సారి గంట శ్రీనివాసరావు అని, మూడవసారి కిమిడి కళా వెంకటరావు అని అభిప్రాయ సేకరణ చేసినా ఏ ఒక్కరికీ టికెట్టు ప్రకటించకపోవడం ఏంటని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. 2019 ఎన్నికలలో టిడిపి తరుపున పోటీ చేసి ఓటమిపాలైన కిమిడి నాగార్జున చీపురుపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ గా, విజయనగరం పార్లమెంటు అధ్యక్షులుగా భాద్యతలు నిర్వహించారు. చీపురుపల్లి అసంబ్లీ అభ్యర్థిగా కిమిడి నాగార్జున ను అధిష్టానం ప్రకటిస్తుందని ఊహాగానాలు ఊపందుకున్నాయి. మొదటి జాబితాలో ప్రకటించి లేదు. తరువాత ప్రకటిస్తారని అనుకున్నారు. అప్పుడు కూడా ప్రకటించకపోగా అనూహ్యంగా గంటా శ్రీనివాసరావు పేరు తెరపైకి రావడంతో చీపురుపల్లి టికెట్ పై సందిగ్ధత నెలకొంది. నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు అభ్యర్థి ప్రకటనపై అధిష్టానం పై ఒత్తిడి తేకపోవడం కూడా ఆలస్యానికి ఒక కారణంగా చెబుతున్నారు.